# వాయిదా

## ఎస్.ఎస్.ప్రకాష్

సృష్టిలో ఉత్తమమైనది మానవ జన్మ.

సృష్టిలో దుర్బలుడు మానవుడు.

సృష్టిలో ఏ ప్రాణి మరొక ప్రాణిని హింసించదు, ఆహారానికి తప్ప. మానవుడికి మేధస్సు ఉంది. అందుకే అవసరానికి మించి దాచుకుంటాడు.

దానిని రైటిస్టులు స్వార్థం లేక లాభం అంటారు.

లెఫ్టిస్టులు దోపిడీ అంటారు. పేరు ఏదైనా ఫలితం ఒక్కటే. మరొక మనిషికి అవసరాలు తీరవు. అవసరాలు తీరని మనిషి అప్పులు చేస్తుంటాడు. అప్పులు దొరక్కపోతే నేరాలు చేస్తాడు. అదీ కాకుంటే ఆత్మహత్య చేసుకుంటాడు. మనిషి తప్ప మరే ప్రాణి ఆత్మహత్య చేసుకోదు. బహుశః వాటికి ఆ ప్రక్రియ తెలియక పోవచ్చు. అందుకే సమస్త ప్రాణుల్లోకెల్ల దుర్బలుడు మానవుడొక్కడే.

సంధ్యా సమయం. జడ్జి వేంకటరావు గారు గవర్నమెంటు వారు తమ కిచ్చిన క్వార్టరు బయట నున్న లాన్‌లో కూర్చొని టీ త్రాగుతూ బొచ్చులేని కుక్కపిల్లతో ఆడుకుంటున్నారు.

"సార్" అన్న పిలుపు విని వెనుకకు తిరిగారు. ఎదురుగా బంట్రోతు పాపారావు ఒక కవరు పట్టుకొని నిల్చున్నాడు.

'ఏమిటి?' అన్నట్లు పాపారావు మొఖంలోకి చూశారు వేంకటరావు గారు.

"ఎవరో వచ్చి మీ కీ కవరు ఇవ్వ మన్నారు సార్" అంటూ తన చేతిలోని కవరు అందించాడు పాపారావు.

"ఎవరు?" అడిగారు జడ్జిగారు.

"తెలియదు సార్! పేరు అడిగినా చెప్పకుండా వెళ్లిపోయాడు సార్" జడ్జిగారు తరువాత అడగబోయే ప్రశ్నకు ముందుగానే సమాధానం చెప్పాడు పాపారావు.

మస్తిష్కంలో ఆలోచనలు చెద పురుగుల్లా తొలుస్తోంటే మౌనంగా కవరు అందుకున్నారు.

ఆ కవరు ఎవరు పంపారు?


ఎందుకు పంపారు?

ఏమున్నది అందులో?

సవాలక్ష ప్రశ్నలు ఆయన మదిలో ఒక్కసారిగా మెదిలాయి. లిప్తపాటు కాలంలో ఆ ఊరు వచ్చిన రెండున్నర సంవత్సరాలలో ఆయన తీర్పునిచ్చిన కేసుల్లో పార్టీలు, నిందితులు, నేరస్థులు, ఇంకా పెండింగ్ ఉన్న కేసులు మొత్తం ఒక్కసారిగా ఆయన మస్తిష్కంలోకి వచ్చాయి. ఆ ఊరు నుండి బదిలీ కావటానికి మరొక ఆరు నెలలు గడువున్నది.

ఎవరు రాశారో అడ్రను ఏమీ లేదు. 'జడ్జీ గారికి' అని మాత్రమే ఉన్నది. లోపల ఏ ముందా అని తడిమి చూశారు. స్పర్శ వలన ఒకటో, రెండో కాగితాలు ఉన్నట్లు గ్రహించారు.

కవరు ఒక వైపు చింపుతూ తన డ్రాయింగ్ రూములోకి నడిచారు.



ఏదో ఉత్తరంలా ఉన్నది. అలా అనుకున్న వెంటనే ఆయన భ్రుకుటి ముడిపడింది. ఆ ఉత్తరం చూడాలా వద్దా అని ఒక్క నిమిషం ఆలోచించారు తన కెవరు ఉత్తరం రాశారా అని. ఆయన కళ్ళు ఉత్తరంలోని అక్షరాల వెంట పరుగిడటం ప్రారంభించాయి. ఆ అక్షరాలు :

న్యాయమూర్తి గారికి,

మీకు ఇలా ఉత్తరం రాయటం తప్పో, ఒప్పో నాకు తెలియదు. త ప్పయితే నాకు శిక్ష పెంచండి. దయచేసి ఉత్తరం మాత్రం పూర్తిగా చదవండి.

ఆత్మహత్యకు ప్రయత్నించిన నేరం క్రింద నన్ను అరెస్టు చేశారు. రేపు మీ కోర్టులో నన్ను హాజరు పరచబోతున్నారు. నా పేరు శేఖర్. డిగ్రీ వరకు చదివాను. ఆర్థికంగానూ, శారీరకంగానూ బలహీనమైన వాడిని. వెనుకా, ముందూ ఎవరూ లేరు. ఏమీ లేదు. తండ్రి చిన్నప్పుడే పోయాడు. రెక్కలుముక్కలు చేసుకుని పెంచిన తల్లి నాకు రెక్కలు వచ్చాయన్న సంతోషంతో తన రెక్కలు ఒరిగిపోయాయంటూ తాను కూడా వెళ్ళిపోయింది. ఎన్నో ఉద్యోగాల కోసం ప్రయత్నించాను. బ్రతకటం కోసం నీతిగా చేసే ఏ పనికైనా సిద్ధపడ్డాను. కప్పులు కడిగాను సామాన్లు మోశాను. ఏ ఉద్యోగంలోనూ స్థిరపడలేకపోయాను. నాకు స్థిరమైన ఉద్యోగం ఏమీ దొరకలేదు.

మొన్నటి వరకూ పని చేసిన హొటల్‌ని ఎవరో ఆందోళన కారులు తగుల బెట్టారు. అది కూడా పోయింది. దిక్కులేని పరిస్థితుల్లో బిచ్చమెత్తలేక ఆత్మహత్య చేసుకోబోతే నెలాఖరులో కేసులు లేని పోలీసులు నన్ను తెచ్చి లాకప్‌లో పెట్టారు.

నా కథంతా చెప్పింది మీ సానుభూతి కోసం కాదు. లేక మీ రేదో నాకు ఉద్యోగం ఇప్పిస్తారని కాదు. నన్ను మీరు వదలివేస్తే నాకు బయట ఆహార సమస్య!

మరలా నేను ఆత్మహత్య అయినా చేసుకోవాలి లేదా నేరాలైనా చేయాలి. ఏదైనా నేరమే మీ దృష్టిలో.

మన రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు ఉన్నది. కాని 'ఎలా' అన్న దానికి సమాధానం లేదు. నన్ను బయటికి వెళ్ళి ఎలా బ్రతకమంటారు చెప్పండి? గౌరవంగా బ్రతకటానికి అవకాశాలు కల్పించలేని ప్రభుత్వం, చట్టం చావ నివ్వవు.

బ్రతికేందుకు దారి చూపరు.

బ్రతక లేనందుకు చావ నివ్వరు. నా బోటి నగటు నిరుద్యోగులు ఏం చెయ్యాలి ఈ దేశానికి?

కనుక మానవతా దృక్పథంతో ఆత్మహత్యను ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో చేర్చాలి.

నిర్జీవమైన జీవించే హక్కుని రాజ్యాంగంలో నుండి తీసెయ్యాలి.

'నన్ను చావ నివ్వండి' అంటే మీరు, మీ చట్టం ఒప్పుకోవు. పోనీ మీరే నన్ని చట్టరీత్యా హత్య చేయండి.

దయచేసి నాకు ఉరిశిక్ష విధించండి.

సాటి మానవునిగా నా కీ సహాయం చేయండి.

నమస్కారములతో

శేఖర్

ఉత్తరం చదివిన వేంకటరావు గారి కళ్ళలో రెండు నీటి పొర లేర్పడి చుట్ట చుట్టుకొని చుక్కల రూపంలో బయటికి వచ్చాయి. ఒక నిరుద్యోగి నిస్సహాయత, నిరాశ, ఆలోచన, అన్నిటికీ మిం చి ఆత్మాభిమానం, నిజాయితీ ఆ అక్షరాల్లో దర్శనమిచ్చాయి.

*** *** ***

"సైలెన్స్" అన్న కోర్టు అటెండరు కేకతో కోర్టు హాలంతా నిశ్శబ్దం అయిపోయింది. లాయర్లు అంతా లేచి నిలబడ్డారు. జడ్జీ గారికి నమస్కార, ప్రతి నమస్కారాల తరువాత మరల ఎవరి గోల వారిదే.

కోర్టులో రోజు వారీ తతంగమంతా హడావిడిగా జరిగిపోతోంది. వేంకటరావుగారి మనస్సులో మాత్రం శేఖర్ మెదులుతున్నాడు.

నిందితుల బోను ప్రక్కన ఒక అర డజను మంది కుర్రాళ్ళు, కొందరు నడి వయసు వారు నిలబడి ఉన్నారు. తుపాకులు పుచ్చుకున్న పోలీసులు వాళ్ళకి కాపలా కాస్తున్నారు.

కాని వేంకటరావు గారు మాత్రం 'వాళ్ళలో శేఖర్ ఎవరై ఉంటాడా' అని ఆలోచిస్తున్నారు. గోడ ప్రక్క నున్న బక్క పలుచని కుర్రాడు, మాసిన గుడ్డలతో, పెరిగిన గడ్డంతో ఉన్నాడు. అతనే అయి ఉంటాడని పరీక్షగా చూస్తున్నారు అతని వంక. ఆ చూపు వెనుక ఎన్నో సంవత్సరాల అనుభవం ఉంది. చూపుల్తో నేరస్థులను పట్టే గుణం ఉంది. ఆయనకు శేఖర్ నేరస్థుడిలా కనబడలేదు.

రకరకాల రికార్డులు ఆయన ముందు పెడుతున్నారు. కోర్టు క్లర్కు కివ్వ వలసిన ఆదేశాలు ఇస్తున్నాడాయన. ఆయన మన స్సంతా శేఖర్ మీదే లగ్నమయి ఉన్నది.

శేఖర్‌కు సంబంధించిన ఎఫ్.ఐ.ఆర్ కూడా ముందు పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు తన కథనంతో పబ్లిక్‌గా మానవత్వాన్ని హత్య చేయటం మొదలు పెట్టారు.


శేఖర్ అనే ఈ ముద్దాయి మొన్న రాత్రి అనగా శనివారం రాత్రి 11 గంటలకు అంకాళమ్మ గుడి వెనుక రైలు పట్టాలపై పడుకొని ఉండగా అరెస్టు చేసి తీసుకొచ్చారు ఎస్.ఐ గారు. ఆత్మహత్యా మహాపాతక మైనందున, నేర మైనందున ఈ ముద్దాయిని శిక్షించి ఇక ముం దెన్నడూ, ఎవరూ ఆత్మహత్య చేసుకోని విధంగా .... ఇంకా ఏమేమో చెబుతున్నారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు.

"నీ వేమయినా చెప్పుకునేది ఉందా" అడిగారు శేఖర్ని.

"లేదు" అంటూ అడ్డంగా త లూపాడు శేఖర్.

*** *** ***

తనకున్న అధికారాలన్నీ సమీక్షించి కేసుని మూడు నెలల వాయిదా వేశారు జడ్జిగారు! ఇంత సింపుల్ కేసు మూడు నెలలు వాయిదానా అంటూ అక్కడ ఉన్న లాయర్లు, లాయర్ల బాధితులు, ప్లీడరు గుమస్తాలందరూ నోళ్ళు తెరిచారు.




నిజం వేంకటరావు గారికి, శేఖర్‌కి మాత్రమే తెలుసు. చట్ట ప్రకారం తాను శిక్షించాలి. మానవతా దృక్పథంతో వదలి వేస్తే మరల ఆత్మహత్య చేసుకోవచ్చు. ముందు అతనికి ముఖ్యంగా తీరవలసింది ఆహార సమస్య. తిరిగి తన దగ్గర ఏమీ ఆశించని వారి వద్ద శేఖర్‌కి ఉద్యోగం ఇప్పించాలంటే, అటువంటి వారిని వెదకటానికి తనకు వ్యవధి కావాలి.

శేఖర్ నుండి తా నేమీ ప్రతిఫలం ఆశించటం లేదు.

ప్రతిఫలం లేని సహాయం చేయటంలో తృప్తి ఉంది.

తన కది చాలు. తనకు, శేఖర్‌కు వ్యవధి కావాలి.

అందుకే ఈ వాయిదా!!